# అంతర్జాతీయ రచయిత కథ

ప్రపంచ ప్రఖ్యాత రచయిత సిడ్నీ షెల్డన్ తను రాస్తున్న కొత్త నవలని పూర్తి చేస్తున్నాడు. ఉదయం ఆరింటికి లేచి, అరగంట తన ఇంట్లోని ఈత కొలనులో స్విమ్మింగుచేసి స్నానం పూర్తిచేసుకొని తన స్టడీరూంలోని ఎలక్ట్రానిక్ టైపురైటర్ ముందు కూర్చున్నాడు ఆఖరి కాగితం చదివి, టైపురైటర్‌లోకి కొత్త కాగితం ఎక్కించి నవలని టకటక టైపు చేయసాగాడు. ఓ పాత్రపేరో, ప్రదేశమో వెంటనే గుర్తురాకపోతే మధ్యలో ఆగి, రిఫెరెన్సు నోట్సు చూసుకొని మళ్ళీ టైపింగు కొనసాగిస్తున్నాడు. మధ్యలో కుర్చీలో వెనక్కు వాలి కళ్ళు మూసుకొని ఆలోచించి మళ్ళీ టైపు చేయసాగాడు మళ్ళీ ఆగి లేచి అటూ ఇటూ పచార్లుచేసి ఓ ఆలోచన రూపుదిద్దుకున్నాక టైపు చేయసాగాడు. తను టైపు చేసింది నచ్చక, కొంతభాగం స్కెచ్ పెన్‌తో కొట్టేసి పుస్తకాల రేక్‌లోని కొన్ని పుస్తకాలని రిఫర్ చేసి మళ్ళీ కొత్తగా టైపు చేయసాగాడు. నవల మొదటి ప్రతి తయారుచేయటానికి ఆయన చేసే కృషి ఏ టి. వి. లోనో చూపిస్తే ప్రేక్షక పాఠకులు టాప్ రైటర్ అవాలంటే ఎంత ప్రసవవేదన పడాలో గుర్తించగలరు. ఏడునుంచి తొమ్మిదిదాకా, రెండు గంటలసేపు సిడ్నీ షెల్డన్ అనే తన కొత్త నవలమీద మనసు, మేధస్సు కేంద్రీకరించి టైపు చేసాడు పన్నెండు కాగితాలు.

తర్వాత లేచి బ్రేక్‌ఫాస్టు తీసుకొని ఆఫీసుగదిలోకి వచ్చాడు.

"మార్నింగు" తన సెక్రటరీని విష్ చేశాడు.

"గుడ్‌మార్నింగ్. ఎలా వచ్చింది?" అడిగింది ఆమె చిరునవ్వుతో.

సంతృప్తిగా తలవూపాడు.

"యం జి యం. వాళ్ళు మీ కొత్త నవల దేన్ని గురించో తెలియ చేయమని ఫోన్ చేసారు" చెప్పింది సెక్రెటరీ.

"జీవితం గురించి అని చెప్పు" నవ్వాడు.

ఆయనకి తన నవల మార్కెట్‌లోకి రాకుండా ఎవరయినా అడిగి తెలుసుకోవటం నచ్చదు.

"మీ కోసం ఫేన్స్ వెయిట్ చేసున్నారు"

ఆయన విజిటర్స్ గదిలోకి వెళ్ళాడు. రోజూ వుదయం ప్రపంచం నలుమూలలనించి ఫేన్స్ ఆయన్ని చూడానికి రావడం మామూలే. అందరితో కరచాలనం చేసి వాళ్ళ ప్రశ్నలకి ఓపికగా సమాధానాలు చెప్పాడు. కొందరు ఆయనతో కలిసి ఫొటోలు తీసుకుంటే, మరి కొందరు ఆయన ఆటోగ్రాఫ్ తీసుకొన్నారు. తమతో తెచ్చుకొన్న ఆయన రాసిన నవలల మీదో లేదా ఆటోగ్రాఫ్ పుస్తకాల మీదో

"మీరు ఇండియన్ కదా?" కొద్దిగా సిగ్గుతో దూరంగా చదువుతూ కూర్చునున్న ఒకామెను అడిగాడు.

ఆమె తల వూపింది.

"మీ భారతదేశం బేక్‌గ్రౌండ్‌గా తీసుకుని ఓ నవల రాద్దామనే వుద్దేశంవుంది" చెప్పాడు సిడ్నీ షెల్డన్.

"నేను హ్యూస్టన్‌లో సెటిల్ అయి పదిహేను సంవత్సరాలై పోయింది. అమెరికన్ పౌరసత్వం కూడా తీసుకున్నాను. ఇది నా చెల్లెలు భావన. మీకేమైనా వుపయోగకరమైన సమాచారం కావాలంటే ఇదిస్తుంది." చెప్పిందామె తన పక్కనున్న చెల్లెలుని పరిచయం చేసి.

"మీ మాతృభాష? ఇండియాలో పధ్నాలుగు భాషలున్నాయని విన్నాను?"

"తెలుగు సౌత్ ఇండియాలో వుంది. మాది ఆంధ్రరాష్ట్రం." జవాబు చెప్పింది భావన.

"మీరు తెలుగు నవలలు చదువుతుంటారా?" అడిగాడు సిడ్నీ షెల్డన్.

తల వూపింది భావన.

"తెలుగులో ఎవరు పాపులర్ రచయితలు?"

కొన్ని పేర్లు చెప్పింది భావన.

"ఎలాంటి విషయాల మీద రాస్తూంటాడు ఆ మొదటి రచయిత? నాకో అలవాటు వుంది ఇతర భాషల నవలలు ఎలా వున్నాయో తెలుసు కోవడం సరదా ఆయన రాసిన అయిదారు నవలల కధని క్లుప్తంగా నాకు ఇంగ్లీషులో రాసివ్వగలరా?"

"తప్పకుండా?" తన అభిమాన రచయిత అలా అడగటం భావనకి సంతోషం కలిగించింది

"మీకేం ఇబ్బంది లేకపోతేనే?!"

"ఇట్స్ ప్లెషర్"

మర్నాడు భావన తెలుగులో పాప్యులర్ రచనలు చేసే ఆ రచయిత నవలల కధల సారాంశం ఇంగ్లీషులో కాపు చేసి తీసుకెళ్ళి సిడ్నీషెల్డన్‌కి ఇచ్చింది. ఆయన వాటిని అక్కడికక్కడే చదివేశాడు. ఒకో నవల సారాంశం చదివిన కొద్దీ ఆయన భృకుటి ముడిపడసాగింది చివరిది కూడా పూర్తిచేసి తల పంకించి ఆమెకి తిరిగి ఇచ్చేసాడు.

వారం తర్వాత న్యూయార్క్‌లోని ఫైవ్‌స్టార్ హోటల్ హిల్టన్‌లో "అమెరికన్ రైటర్స్ గిల్డ్" వారు ఏర్పరిచిన ఏన్యువల్ గెట్ టుగెదర్‌కి సిడ్నీషెల్డన్ కూడా హాజరయాడు ఆ రాత్రి ముఖ్యఅతిధిగా బ్రిటన్‌నించి వచ్చిన రచయిత జెఫ్రీ ఆర్చర్‌తో చెప్పాడు.

"బ్రదర్! నీ "నాట్ ఏ పెన్నీ మోర్- నాట్ ఏ పెన్నీ లెస్" ఇండియాలోని ఆరుకోట్లమంది మాటాడే "తెలుగు" భాషవాళ్ళకి పరిచయం అయింది. ఆఫ్‌కోర్స్ నీ పేరుతో కాదులే"

"ఎలా?"

"ఇప్పుడది అక్కడ ఓ పాప్యులర్ నవల. అలాగే నా నవల మాస్టర్ ఆఫ్‌ది గేమ్ లోని కొన్ని భాగాలు నవలగా వచ్చింది. మిత్రుడు రాబిన్ కుక్ నవల "ఫీవర్"కూడా ఇంకా ఓమెన్, టు ఫైనల్ కాన్‌ఫ్లిక్ట్ నవలలు కలిసి, ది ఎగ్జార్సిస్టు నవల.... మన రచనలన్నీ మరొకరి పేరుతో తెలుగు పాఠకులకు బాగా సన్నిహితం అయ్యాయి. మిగతా భాషల రచయితలు మనకి రాసి అనుమతి తీసుకొని రాస్తుంటే, ఈ తెలుగు రచయిత ఒక్కడే గ్రంధచోర్యం సాగిస్తున్నాడు.

అది విన్న తక్షణం మాట్లాడే ఆర్థర్ హెయిలీ చెప్పాడు.

"తప్పు ఆ రచయితది కాదు. గ్రంథ చౌర్యాన్ని ప్రోత్సహించిన ఎడిటర్స్‌ది."

"మన నవలని అలా యథాతథంగా అనువదించకుండా స్వంత బుర్రని వుపయోగించిన ఆ రచయితది ఇంకా తప్పు" నవ్వుతూ చెప్పాడు ఇర్వింగ్ వెలెస్.

# సస్పెన్స్

గోదావరి నదీతీరం.

తెల్లరంగులో హుందాగా, అందంగా వున్న ఆ పడవ దగ్గరకి నడిచాడు.

"అవతలి గట్టు చేరుకోవాలి. ఏం తీసుకుంటావ్" అడిగాను.

"రెండ్రూపాయలండి" చెప్పాడు.

"నా పడవ రూపాయిన్నరకే వస్తుంది"

ఆ మాటలన్న వ్యక్తివైపు చూసాను. అతనూ పడవనడిపే వాడే నని దుస్తుల్నిబట్టి తెల్సిపోతుంది.

"అసలు రేటు రూపాయేనండి. వాడి పడవ ఎవరూ ఎక్కరు కాబట్టి మీలాంటి కొత్త పేసెంజర్లు వచ్చినప్పుడల్లా రెండు రూపాయలు చెప్పాడండి అని తానా పడవే ఎక్కుడంతో ఓ అర పెంచానండి" చెప్పాడా రెండో పడవవాడు.

"ఎందుకు వాడిపడవ ఎక్కరు?" అడిగాను అసక్తిగా.